"పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ!
పద్మావతీ చరణ చిత్రిక చిత్త సద్మా!"

# ★ అనుకూల దంపతులు ★

హార్వీ

రేపు చెల్లెలు పెళ్ళి. పొరుగూరులో వుండడం వల్ల నేనూ రైలు దిగి పెళ్ళివారితో బాటు ఇల్లు చేరుకొన్నాను.

అంతా మహావైభవంగా ఉంది ఇంట్లో.

కాళ్ళాలు పడేసుకోవడానికి కాస్త చోటైనా లేదు, అంత ఇంట్లోనూ. ఆఖరుకి ఎంతో ప్రయత్నంమీద పెద్దక్కయ్య కూతురు విమ్యాలా దగ్గర కొంచెం చోటు రిజర్వు చేసుకొన్నాను.

ఇంట్లో రణగోలగా ఉంది. ఎవర్ని చూసినా ఏదో ఒక అవ్యక్త నిర్దేశపు పనిమీద తిరుగుతూ ఉన్నారు. హడావిడిగా, మామగారికి కాఫీ అని అడిగి తెచ్చి ఇచ్చేదాకా వేపుకొని తినే ముక్కూ మొహం ఎరగని ముద్దు అత్తయ్యలూ, చంటిపిల్లల భోజనాలనీ, కాఫీలనీ, ఇవీ అవీ పెళ్లివారికి పంపమన్నారని చెప్పి తీరా చేసి వారంతట వారే కాజేసే పెళ్లి పెద్దల అదమాయింపులూ, ఇతర సరంజామాలు ...అబ్బ! ఒకరికి సమాధానం చెప్పేలోపున నాలుగు అర్జంటు ఆర్డర్లు.

* * *

ఇంతకూ మా అదృష్టవశాత్తూ మగపెళ్ళివారు చాలా నెమ్మదస్తులు. వరుడు నాకొంచెం తెలియడం వల్ల అట్టే చిక్కులు పెట్టటం లేదు. ఎంత బాధైనా మాకు ఎవరికీ తెలియని ఏ ఇద్దరో ముగ్గురో బంధువులిచ్చిందే.

అంత వైభవంగా జరుగుతూన్న పెళ్లిలోనూ ఒక విచిత్ర వ్యక్తి ప్రవర్తనే చాలా హాస్యరసపూరితంగానూ, చిరకాలము జ్ఞాపకముండే లాగానూ ఉంది.

* * *

అన్నిటికన్నా ఆఖరుగా కోరుకొనే పెండ్లి రోజు ముందటిరాత్రి మామీద క్రూరంగా వచ్చిపడింది. సామాన్యపుటింటిలో, వచ్చిన బంధువులందరికీ పడుకోవడానికి చోటుచూపెట్టే సరికి, నెహ్రూ ప్రభుత్వానికి కాందిశీక సమస్య నెదుర్కోవడం ఎంత కష్టమో, కాస్త రుచి తెల్సింది. అప్పుడే రాత్రి తొమ్మిది.

ఇంకా పన్నెండు గంటలకి గాని మాంగల్యధారణ మొదలగు వివాహపుతంతు మొదలు పెట్టరు. అప్పటివరకూ మా కూపిరాడదు.

రేపటిరోజు కార్యక్రమాన్నాలోచిస్తూ, ఒక మూలనించి మొదలుపెట్టి పెద్దలకు చోటు చూపెట్టూ వస్తూన్నా పడుకోవడానికి.

ఉభయపక్షములకూ బంధువులూ, వయోవృద్ధులూ అయిన వెంకన్న తాతగారికి భగీరథ ప్రయత్నంమీద ఎక్కణ్ణుంచో ఒక నులకమంచాన్ని తెచ్చివేసి త్వరగా పడుకోమని చెప్పి నా పనిమీద నేను వెళ్లిపోయాను. మళ్లీ మరో పదినిముషాలకు అలా వెళ్తూ చూస్తే అక్కడ మంచంమాత్రం లేదు. ఆ తాతగారు క్రింద పడుకొని, నానా అపసోపాలూ పడుతూన్నారు. ఏమయిందని అడిగితే ఆయనెవరో తన "వైఫ్"కి కావాలంటూ బలవంతంగా తీసుకొని వెళ్లేడని చెప్పేరు. నాకు ఆశ్చర్యం వేసింది, ఎవరబ్బా ఈ భార్యా సేవా నిరతుడూ-ధైర్యంగా ముసలాయన్ని లేవగొట్టేసిన పురుషోత్తముడూ అని. సామాన్యంగా అందరికీ తోచేలాగే నాకూ మగపెండ్లివారిలో ఒకరయి వుండాలని తట్టింది.

ఇంతలో పెండ్లికొడుకు అలా నడుస్తూ ఏమిటండోయి వెదుకుతున్నారని అడిగేడు (ఇదివరకు కొంచెం తెలుసులెండి; అందుకే చనువు. లేకపోతే కొత్త పెండ్లికొడుకులు ఈ రోజుల్లో బావతోను మరదల్తోనూ మట్లాడ్డమే!) బాగా దొరికేరనుకొని ఆయనతో సంగతంతా చెప్పి కొంచెం మీ తాలుకేమో చూడమని అడిగాను. సరేనని ఆయనతో బాటు ఆ మొగవీరుడి కోసం బయలుదేరేం.

ఒకమూల శుభ్రంగా చేసుకొని, ఖులాసాగా సతీలలామతో ప్రసంగిస్తూ ఒకాయన (స్థూలకాయుడు) ఆ మంచంమీద ఓ చిన్నపిల్లవాడిని పడుకోపెట్టుకొని తాంబూలం సేవిస్తూన్నాడు. ఒక్కసారిగా మేమిద్దరమూ ఒకర్నొకరు మీకాయనెవరో తెలుసునా - అని ప్రశ్నించుకొన్నాం. సరే, ఇక లాభంలేదని నేనే చొరవ చేసి పెండ్లికొడుకు పడుకోవాలంటూన్నాడన్న వంకమీద ఆయన్ని బలవంతంగా లేపేసి, ఆమంచాన్ని మళ్లీ తాతగారికి వేసి ఈసారి లేవద్దని చెప్పేటప్పటికి సుమారు అర్ధరాత్రి అవడమూ, వివాహనాటికలోని ప్రథమరంగము ముగియడమూ అయింది.

క్రమంగా నాచోటుకి నేను చేరుకొంటూ, ఇంతట్లో మా పెద్దక్కయ్య కనపడితే అడిగేను ఎవరే ఆపెద్ద మనుష్యుడని. అది నవ్వుతూ ఆయన మన సూపరువైజు మామగారి 'స్క్రూ' వదులైన ఆఖరు భావమరిదిగారనీ, వచ్చింది మొదలు ఆయన ప్రవర్తన చాలా అసహ్యంగా వుందనీ చెప్పింది. కాస్త విస్తరించి చెప్పమని నేను అడుగుతే మా మేనత్తగారమ్మాయి సూరి కొత్త ఫ్లోరసిన్ చీర కట్టుకొని అలా వెళ్తూంటే తీరుబడిగా ఆడవాళ్ల మధ్య పరివేష్టితుడయిన ఆయన దాన్నొకసారి బంగారమ్మని పిల్చి, ఈ చీర చాలాబావుంది, ఈ కలరు నేను చాలా లైక్ చేస్తాననడమూ, అసలే కాస్త పెంకిపిల్ల అయిన సూరి ఆయన్ని చూసి 'అయితే యిది కట్టుకోండి' అనడమూ ఇంకా అన్నీ చెప్పింది. సరే, రేపు ఈయన సంగతి కాస్త చూద్దామనుకొన్నాను.

తెల్లవారగనే అందరూ హడావుడిలో ముస్తాబవుతూన్నారు. ఎక్కడచూచినా పట్టుచీరల జరజరలే. 'అవి కావాలి; ఇది లేదు' అన్న అరపులే. ఏదో పనుండి అలా పెద్దగదిలోకి వెళ్లేను. ఆ గదంతా ఆడవారితో నిండిపోయింది. ఆ మూలకు ఈదుకొంటూ ఎలా వెళ్లడమా అని ఆలోచిస్తూ నిలబడ్డా ఒక క్షణంపాటు. ఇంతలో కనబడ్డారా మగాయన ఓమూల కాఫీ తాగుతూ మిగతావారందర్నీ పలకరిస్తూ కూర్చుని. ఇంతలో నన్ను చూచి సూరి బయటకువచ్చి బట్టలు మార్చుకోవడానికి బయటెక్కడా చోటులేదు కొంచెం ఆయన్ని అవతలకి తరిమేయమని ప్రార్థనపూర్వకంగా ఆజ్ఞాపించింది. దొరికిందిరా అవకాశమని ఆయన్ని బయటికి నడవమని చెప్పేను నిష్కర్షగా. కొంచెం కోపంవచ్చి వుంటూంది. 'నా వైఫ్‌తో మాట్లాడవలసి కూర్చున్నాను లెండి' అంటూ మెల్లిగా అవతలకి నడిచేడు.

ఇది మా ద్వితీయ సమాగమం. మంగళసూత్రధారణ, తరువాత తంతూ అయింది ఖులాసాగా పెండ్లి భోజనాలు కూడా అయ్యాక కట్టాళ్లందరమూ చేరి పేకాట ఆడుతూన్నాం. ఆట మాంచి రసపట్టులో ఉన్నప్పుడు మా అక్కగారి పెద్దమ్మాయి వచ్చి నాతో మెల్లిగా, 'మామయ్యా సాండల్సు అంటే ఏమిటి?' అని అడిగింది. అర్థం చెప్పి ఎందుకు కావల్సొచ్చిందో కారణం తరచి అడిగేను. మెల్లిగా ఆయన ప్రతీవాళ్లని మా ఆవిడ సాండల్సు చూశేరా అని అడుగుతూన్నారని చెప్పింది. దాంతో మా కందరికీ ఆయనకు తగిన శాస్తి చెయ్యాలని తోచి అందరమూ కలసి లోపలికి వెళ్లేం. మేం అనుకొన్నట్టే ఆ పెద్దగదిలో కూర్చుని, డెర్బీ గుర్రప్పందేల్లో ఓడిపోయిన పందెపు గాడి-లాగ మొహంపెట్టుకొని ఆ దార్ని వచ్చే పోయే వారినందర్నీ ఏమండీ మా ఆవిడ శాండల్సు చూసేరా? అని అడుగుతున్నారు. మొదటగా నేను వెళ్లి, 'ఏమండీ ఏమన్నా పోయిందా!' అని కదిపేసరికి నన్నూ ఆ ప్రశ్న వేసేడు. కాని వెనుక కూర్చున్న ఆయన ఇల్లాలుకు ఇది అవమానంగా తోచింది కాబోలు, 'ఉష్ అంత ఆర్భాటం, రాద్ధాంతమూ చెయ్యకండీ! పోతేమళ్లీ కొనుక్కోవచ్చు.' అంటూంది మెల్లిగా. ఆయన మరీ విచారంతో 'అలా అంటే ఎలాగే! పదహారు రూపాలెట్టి కలకత్తాలో కొన్నవి ఇంకా వాడనైనా లేదు.' ఇంకా ఏదో చెప్పబోతూంటే మా గ్రూపులో ఒక్కొక్కరూవచ్చి పరామర్శచేయడమూ లోలోపల నవ్వాపుకోలేక బాధపడ్డమూ జరుగుతూంది. ఇంతలో మాబావవొకడు - ఒక పాతచెప్పు జాగ్రత్తగా తెచ్చి 'ఒక్కటిగా పడి వుంది ఇదేమో చూడ'మని ముందరపడేసే సరికి, ఆయనక్కోపంవచ్చి ఏదో విసుక్కుంటూ అవతలకి జోరుగా నడిచేడు.

ఆయన వెళ్తూన్నపుడు నాతో రహస్యంగా చెప్పేడు ఇలాంటి జోడింకోటి కనబడితే కొంచెం ఎలాగో అలాగ పంపమని. నేను ఆన వాలుకోసం ఆ వున్న దాన్ని పుచ్చుకొన్నాను.

బంధువులు అందరూ వెళ్లిపోయాక ఓ బీరువా వెనుక ఒకచెప్పు దొరికింది, అది ఆయన ఇల్లాలు గారి పోయినజోడు. ఆరెంటినీ జతపర్చి పంప డానికిష్టంలేక ఒక కార్డువ్రాసి పడేసే నాయనకి.

'శ్రీ... గారికి, అయ్యా, మీ ఆవిడ జోళ్లు పోయినది. దొరకినది. వాటిని పోస్టులో పంపుట కిష్టంలేక మా చెల్లెలికి మీరిచ్చిన పెండ్లి బహు బహుమానంగా ఇచ్చేను. ఆమె మీ ఆవిడకూ ముఖ్యంగా, మీకూ మీ ప్రెజంటు అందుకొని కృతజ్ఞతాభి వందనాలను నా ద్వారా అర్పిస్తూంది.'

# ఘంటాపథం

"దాశరథి"

ఇదే—
బధిరలోక మాలించిన
రుధిర గీతికా రావం

ఇదే—
పతితజాతి మేలెంచిన
భవిష్యదాశారుణ భావం

ఇవే—
కాలఘంటిక మ్రోసిన నిజాలు
కష్టనష్టాలను మోసిన భుజాలు

ఇవే—
రేపు కాబోయే మార్పులు
తెచ్చిన గాయాల బాధకు ఓదార్పులు

ఇక్కడ—
గతాలు సినీమాలా కనుపించి
కమ్మగా వాయించినై విపంచి

ఇక్కడ—
రానున్న కాలం నిలబడి
ప్రజలకు నేర్పుతుంది కొత్తనుడి

ఇవి—
ఒకనాటికి నేరాల సాక్ష్యాలు
ఉన్మాదులు తినే విషపు భక్ష్యాలు

ఇవి—
ప్రతీకారానికి ప్రోత్సాహాలు
ప్రతిమలుగా నుంచున్న దాహాలు

ఇప్పుడు—
ఈ జరిగేదంతా అబద్ధాల గెలుపు
అసలు ఇది వినాశనానికి పిలుపు

ఇప్పుడు—
ఈ కరిగేదంతా అబద్ధాల తెలుపు
అసలు ఇది ఏడు రంగుల కలగలుపు

ఎందుకో—
ఈనాటి కొత్త రాజులకీ కక్ష!
ఈ నాటిన పాపాలకి వీళ్లా రక్ష!

ఎందుకో—
ఆగామిని గూర్చి వీళ్లకు తోచదు!
అవును మరి, వీళ్లని కాలం దాచదు.

కానీండి—
మన పాత పుణ్యాలు కూలనీండి
మనది డీరెయిల్ అవుతోన్న పాసింజరు బండి

కానీండి—
కోసుకుందాం ఒకళ్ల నొకళ్లం
చేసుకుందాం వినాశనాన్ని వెళ్లం

అవును—
ఎటొచ్చాం మనం దారి తప్పి?
పరస్పరం నములుతున్నాం పిప్పి.

అవును—
ఇది తాగితాగి వొచ్చిన దప్పి
ఇక తగ్గదు; ఇది కాలం కడుపు నెప్పి.